క్లుప్తంగా

పన్ను చెల్లింపులపై వడ్డీ మాఫీ

రాయచోటి అర్బన్ : నిర్దేశించిన సమయం లోపు ఆస్తి, ఖాళీస్థలాలపై పన్నులు చెల్లిస్తే వడ్డీ మాఫీ చేస్తామని మున్సిపల్ కమిషనర్ రాంబాబు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అన్ని నగరపాలక సంస్థలు, మున్సిపాలిటీలలో ఆస్తి, ఖాళీ స్థలాలపై ఉన్న పన్ను బకాయిలుపై విధించిన వడ్డీని వన్‌టైం మెజర్‌గా మాఫీ చేస్తామన్నారు. పన్ను బకాయిలను ఈ ఆర్థిక సంవత్సరం బకాయిలతో సహా మార్చి 31లోపు చెల్లిస్తేనే వడ్డీకి మినహాయింపు లభిస్తుందన్నారు. పన్నులను మున్సిపల్ కార్యాలయం పన్ను వసూలు కౌంటర్‌లో, వార్డు సచివాలయంతో పాటు ఆన్‌లైన్, నెట్ బ్యాంకింగ్, డెబిట్, క్రెడిట్‌కార్డుల ద్వారా చెల్లించవచ్చన్నారు. ఈ సదవకాశాన్ని పన్ను చెల్లింపుదారులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నూతన డీఈఓను కలిసిన ఉపాధ్యాయులు



డీఈఓకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఉపాధ్యాయులు

రాయచోటి అర్బన్ : జిల్లా నూతన విద్యాశాఖాధికారిగా బాధ్యతలు చేపట్టిన శ్రీరామ్ పురుషోత్తంకు శుక్రవారం పలువురు ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు. రూటా అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు మహమ్మద్‌హాషీం, ఆల్‌మేవా జిల్లా కోశాధికారి సయ్యద్ సునీర్, ఎస్‌టీయూ జిల్లా మైనార్టీ కన్వీనర్ ఎస్.ఎ.మున్వర్‌లు డీఈఓ శ్రీరామ్ పురుషోత్తంను ఆయన ఛాంబర్‌లో కలుసుకుని శాలువాలు కప్పి, బొకేలను అందజేసి అభినందనలు తెలిపారు.

గంగమ్మకు ప్రత్యేక పూజలు



రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని కొత్త కోడూరులోని గంగమ్మ ఆలయంలో అమ్మవారికి శుక్రవారం మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలోని మూలవిరాట్‌కు అర్చకులు జగత్పతి శర్మ ఆధ్వర్యంలో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

22న ఉగాది సంగీత విభావరి

రైల్వేకోడూరు అర్బన్ : ఉగాది పండుగ పురస్కరించుకొని ప్రత్యేక సంగీత విభావరి, పాటల పోటీలు నిర్వహిస్తున్నట్లు భాను సినీ ఆర్కెస్ట్రా నిర్వాహకులు సి.తిరుపాల్ శుక్రవారం తెలిపారు. స్థానిక డాల్ఫిన్ డెల్ హైస్కూల్ ప్రాంగణంలో 22వతేదీ మధ్యాహ్నం 2 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయన్నారు. ఆసక్తి కలిగిన వారు పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తామన్నారు.

మాధవరం-1లో పారిశుధ్య పనులు



పారిశుధ్య పనులు చేస్తున్న సిబ్బంది

సిద్దవటం : మండలంలోని మాధవరం-1 గ్రామ పంచాయతీలో శుక్రవారం పారిశుధ్య పనులు చేపట్టామని స్థానిక సర్పంచ్ ఆవ్వారు జానకిరామయ్య, గ్రామ కార్యదర్శి లక్ష్మినరసయ్యలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒంటిమిట్ట కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలను దృష్టిలో పెట్టుకొని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మాధవరం-1 గ్రామ పంచాయతీలోని ప్రధాన రహదారికి ఇరువైపుల డ్రైనేజీలో ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించామన్నారు. అంతేగాకుండా గృహిణులు మురుగు నీరును ఎటువంటి పరిస్థితులోనూ గ్రామ పంచాయతీ రహదార్ల గుండా వదలకూడదని తెలియజేశారు.

20న ఐటీఐలో అప్రెంటీస్ మేళా

తంబళ్లపల్లె: స్థానిక టీఎస్ వెంకట సుబ్బారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 20న అప్రెంటీస్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ శేషారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్నమయ్య జిల్లాలో ఐటీఐ పూర్తి చేసిన విద్యార్థులు మేళాలో పాల్గొనవచ్చున్నారు. శ్రీసిటీ, శ్రీకాళహస్తిలోని పలు కంపెనీల ప్రతినిధులు హాజరవుతారన్నారు. ఎంపికైన అభ్యర్థులకు అప్రెంటీస్ విధానంలో ఉపాధి కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

పునరావాస పనులను వేగవంతం చేయండి

- గ్రామాల తరలింపును శరవేగంగా పూర్తి చేయాలి
- అధికారులకు రాజంపేట సబ్ కలెక్టర్ అహ్మద్‌ఖాన్ ఆదేశాలు



ఓబులవారిపల్లె: పునరావాస కాలనీ లే అవుట్‌ను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ అహ్మద్ ఖాన్



చిట్వేలి: ఇరువర్గాలతో చర్చిస్తున్న సబ్ కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్ తదితరులు

ఓబులవారిపల్లె : మంగంపేట కాపుపల్లి, హరిజనవాడ, అరుంధతివాడ మూడు గ్రామాల ప్రజలకు పునరావాసం, మౌలిక సదుపాయాల కల్పనకు పనులు వేగవంతం చేయాలని రాజంపేట సబ్‌కలెక్టర్ అహ్మద్ ఖాన్ అధికారులకు ఆదేశించారు. శుక్రవారం ఏపీఎండీసీ కార్యాలయంలో పునరావాస కాలనీలలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసేందుకు వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ ఆదేశాల మేర మూడు కాలుష్య గ్రామాల లే అవుట్లలో మౌలిక సదుపాయాలు, తాగునీరు, రోడ్లు, విద్యుత్, భవనాల నిర్మాణాలకు సంబంధించి అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. గ్రామాల తరలింపునకు ముక్కావారిపల్లి పంచాయతీలో దాదాపు 100 ఎకరాలలో ఇప్పటికే లే అవుట్‌లు సిద్ధం చేశామని, మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసి గ్రామాలను తరలిస్తామని పేర్కొన్నారు. అనంతరం ముక్కావారిపల్లి పంచాయతీలోని పునరావాస లే అవుట్‌ను పరిశీలించారు. సీపీఓ వెంకటరమణ లే అవుట్లకు సంబంధించిన వివరాలను మ్యాప్ ద్వారా సబ్ కలెక్టర్‌కు వివరించారు. అనంతరం ఏపీఎండీసీ పాఠశాలను సబ్ కలెక్టర్ అహ్మద్ ఖాన్ సందర్శించారు. ఉన్నత స్థాయిలో ఉత్తీర్ణత సాధించేందుకు విద్యార్థులు కృషి చేయాలని సూచించారు. అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రేవతి, హెచ్‌ఎం అనీతలు పాఠశాల గురించి సబ్ కలెక్టర్ వివరించారు. అనంతరం సబ్ కలెక్టర్ ముక్కావారిపల్లి ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. ఆరోగ్య కేంద్రంలోని సేవలపై వైద్యాధికారి రాజశేఖర్‌ను అడిగి తెలుసుకున్నారు.

వివాదాస్పద స్థలం పరిశీలన

చిట్వేలి : మండల కేంద్రంలో గత కొన్ని సంవత్సరాలుగా వివాదాస్పదంగా ఉన్న సయ్యద్ బురందీన్ దర్గా స్థలాన్ని రాజంపేట సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ పరిశీలించారు. ఈ మేరకు శుక్రవారం చిట్వేలి తహసీల్దార్ మురళీకృష్ణతో కలిసి దర్గా స్థలాన్ని పరిశీలించి ఇరువర్గాలతో చర్చించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మురళీకృష్ణ మాట్లాడుతూ స్థలం విషయమై దర్యాప్తు చేస్తున్నామని, ఇరువర్గాలతో చర్చించి సమస్యను సామరస్యంగా పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామన్నారు.

ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టిన ఫణిరాజకుమారి



సిద్దవటం : మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ఎస్. ఫణిరాజకుమారి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇన్‌చార్జి ఎంపీడీఓగా ఈఓపీఆర్డీ బి.పులిరామ్ సింగ్ పనిచేశారు. సింహాద్రిపురం మండలంలో ఎంపీడీఓ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా పనిచేస్తున్న ఫణిరాజకుమారి ఎంపీడీఓగా పదోన్నతిపై సిద్దవటానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల ప్రజల అవసరాలకు ఎల్లవేళల అందుబాటులో ఉంటామన్నారు. మండలంలో ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. జిల్లా స్థాయిలో సమస్యలు ఏవైనా ఉంటే అవి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని ఆమె తెలిపారు. మండల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో కృషి చేస్తామన్నారు.

నోటి క్యాన్సర్ రాకుండా జాగ్రత్తలు పాటించాలి



దంతాలను పరిశీలిస్తున్న దంత వైద్యురాలు కీర్తిరెడ్డి

లక్కిరెడ్డిపల్లి : నోటిలో క్యాన్సర్ రాకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని దంత వైద్యులు కీర్తిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో నోటి ఆరోగ్య దినోత్సవం సందర్భంగా నోటి క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కొంతమందికి నోట్లోని దంతాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధూమపానం, తంబాకు, గుట్కా, పాన్ పరాగ్ వంటి మధక ద్రవ్యాల వలన నోటి క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందన్నారు. చాలా మంది యూత్ మాధక ద్రవ్యాలకు అలవాటుపడి నోటి క్యాన్సర్ తెచ్చుకుంటున్నారని ఆమె తెలిపారు. పళ్ళు పుచ్చిన తరువాత ఎక్కువరోజులు అలాగే పెట్టుకుంటే క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. ఉదయం, రాత్రి తప్పనిసరిగా బ్రెస్ చేయాలన్నారు. చిన్న పిల్లలకు చాక్లెట్లు, ఐస్‌క్రీమ్, కుర్‌కురేల వంటి పదార్థాలను పెట్టకూడదన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నీలోఫర్ బేగం, డాక్టర్లు ధరణి కుమార్, శ్రీనివాసరెడ్డి, భరత్, సుభాషిణి, సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దపల్లె రైతు భరోసా కేంద్రం తనిఖీ



రికార్డులను తనిఖీ చేస్తున్న అధికారి నాగరాజు

సిద్దవటం : మండలంలోని పెద్దపల్లె రైతు భరోసా కేంద్రాన్ని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశామని బద్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకులు నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పలు రికార్డులను పరిశీలించారు. రబీసీజన్‌లో సాగైన పంటల వివరాలు, ఈ పంట నమోదు, ఎరువుల పంపిణీ, సూక్ష్మనీటి సేద్య ప్రగతిపై సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు రైతుభరోసా చానల్‌ను వినియోగించుకోవాలన్నారు. రైతులు సాగు సమస్యలపై టోల్ ఫ్రీ నెంబరు 155251కి ఫోన్ చేసి సందేహాలు నివృత్తి చేసుకోవచ్చునన్నారు. ఖరీఫ్- 2023 సీజన్‌కు అవసరమైన పచ్చిరొట్ట విత్తనాలు త్వరగా పంపిణీ చేయాలని రైతులు కోరారని తెలిపారు. భాకరాపేటలో నిర్మితమవుతున్న రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధింత కాంట్రాక్టర్‌కు సూచించామన్నారు. ఖరీఫ్ పంటల ప్రణాళిక సిద్ధం చేయాలని సిబ్బందికి ఆదేశాలిచ్చామన్నారు. రైతు భరోసా మాస పత్రిక వినియోగాన్ని పెంచాలని, రైతులకు అన్నీ రకాల సేవలు రైతు భరోసా కేంద్రంలో లభిస్తాయని, సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఓటర్‌కార్డుకు ఆధార్ అనుసంధానం చేయాలి

– ఆర్డీఓ రంగస్వామి



మాట్లాడుతున్న ఆర్డీఓ రంగస్వామి

చిన్నమండెం : ఓటరుకార్డుకు ఆధార్ అనుసంధానం చేయాలని రాయచోటి రెవెన్యూ డివిజనల్ అధికారి రంగస్వామి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బూత్ స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ఫారం-6బీ ఓటరుకార్డుకు ఆధార్ కార్డు అనుసంధానం తప్పక చేయాలన్నారు. బీఎల్‌ఓలు ఆయా గ్రామాలకు సంబంధించి ఆధార్ అనుసంధాన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందాయని కార్యక్రమాన్ని వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్, రెవెన్యూ సిబ్బంది, బీఎల్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్, సంత వేలంపాటల వాయిదా



వేలంపాటలో పాల్గొనడానికి వచ్చిన వ్యాపారులు

రాజంపేట : పట్టణంలోని దినసరి మార్కెట్, వారాంతపు సంత, బస్టాండు నుంచి రుసుం వసూలుకు శుక్రవారం నిర్వహించిన వేలంపాట వాయిదా పడింది. ఈ సందర్భంగా పురపాలిక సంఘం కమిషనర్ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ దినసరి మార్కెట్, వారపుసంత మార్కెట్, జంతు వధశాల, బస్టాండు వేలంకు తక్కువ ధరకు పాడటంతో వేలం వాయిదా వేశామన్నారు. తిరిగివాటిని ఈనెల 20న వేలం నిర్వహిస్తామన్నారు. 20న జరిగే వేలంపాటలో ఆసక్తి కలిగినవారు ఉదయం 11 గంటలలోపు డీడీ, వాల్యుయేషన్ పత్రాలను అందజేయాలన్నారు. కాగా జంతు వధశాల నుంచి రుసుం వసూలు చేసేందుకు హక్కును రూ.1.50లక్షలతో కనకమ్మ దక్కించుకున్నారని ప్రకటించారు. మార్కెట్‌లోని ఓపెన్ షెడ్డులు బహిరంగ వేలం ద్వారా రూ.12.50లక్షలు ఆదాయం వచ్చిందన్నారు.

శరవేగంగా ఆలయ అభివృద్ధి పనులు



పనులను పరిశీలిస్తున్న అధికారులు

గాలివీడు : ఉత్తరాయణంలో శ్రీవారి ఆలయ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించేందుకు శరవేగంగా సన్నాహాలు చేస్తున్నట్లు ఆలయ ఈఓ కొండారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం గాలివీడులో పర్యటించిన ఆయన పెద్దూరు బ్రాహ్మణవీధి వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి పనులను కమిటీ సభ్యులతో కలిసి పరిశీలించారు. ప్రధాన ఆలయం చుట్టూ లెవలింగ్ పనులు, ధ్వజస్తంభం, మూలవిరాట్ మూర్తులు, ఇతరత్రా పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కమిటీ సభ్యులకు సూచించారు. ఆయన వెంట కమిటీ సభ్యులు హరికృష్ణ, రెడ్డి రిషికేష్, వీరారెడ్డి, మణి కుమార్ తదితరులు ఉన్నారు.

అంతర్జాతీయ త్రోబాల్ పోటీల్లో ప్రతిభ



అంతర్జాతీయ త్రోబాల్ క్రీడాకారుడు గణేష్‌రాజు

మదనపల్లె : బంగ్లాదేశ్‌లో జరిగిన అంతర్జాతీయ త్రోబాల్ పోటీల్లో పట్టణంలోని శ్రీ శ్రీనివాస డిగ్రీ కళాశాలలో బీఎస్సీ ఎలక్ట్రానిక్స్ రెండో సంవత్సరం చదువుతున్న జే.గణేష్‌రాజు గురువారం నేపాల్‌తో జరిగిన ఇంటర్నేషనల్ త్రోబాల్ చాంపియన్‌షిప్ విభాగంలో ఉత్తమ ప్రతిభ కనపరిచారు. త్రోబాల్ చాంపియన్ షిప్ విభాగంలో విజయం సాధించి మూడోస్థానంలో నిలిచిన భారతజట్టులో కీలకపాత్ర పోషించాడు. గణేష్‌రాజు గతంలో రాష్ట్రస్థాయిలో వెస్ట్ గోదావరి, అనంతపురం, విజయవాడ, వైజాగ్‌లలో జరిగిన త్రోబాల్ పోటీల్లో విజేతగా పలు బహుమతులు, ప్రశంసలు పొందాడు. జాతీయస్థాయిలో ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్, హర్యానా, తమిళనాడులో జరిగిన పోటీల్లో పాల్గొన్నాడు. వీటన్నింటిలో మంచి ఆటతనాన్ని కనపరుస్తూ బంగ్లాదేశ్‌లో జరిగిన అంతర్జాతీయ పోటీలకు ఎంపికై విజేతగా నిలిచి మదనపల్లె కీర్తిని చాటిచెప్పినట్లు శ్రీనివాస డిగ్రీ కళాశాల డైరెక్టర్ ఎస్.కృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా తమ కళాశాల విద్యార్థిని అంతర్జాతీయ త్రోబాల్ పోటీల్లో పాల్గొని పతకాలు సాధించడంపై కరస్పాండెంట్ శ్రీనివాసులురెడ్డి, ప్రిన్సిపాల్ బి.వి.రమణాచారి, అధ్యాపక బృందం గణేష్‌రాజుకు అభినందనలు తెలిపారు. భవిష్యత్‌లో మరింత రాణించి, దేశం గర్వపడేలా చేయాలని కోరారు.

కార్మిక, ఉద్యోగ, ఉపాధ్యాయుల ఊసేలేని బడ్జెట్

రాయచోటి అర్బన్ : 2022- 23 సంవత్సరానికి సంబంధించి ప్రవేశపెట్టిన రాష్ట్రబడ్జెట్‌లో కార్మిక, ఉద్యోగ, ఉపాధ్యాయుల ఊసేలేకపోవడం అన్యాయమని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగులు, కార్మికులకు కనీస వేతనాలు, స్కీం కార్మికులకు జీతాల పెంపు గురించి ప్రస్తావన లేకపోవడం బాధకరమన్నారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికుల రెగ్యులైజేషన్ గురించి, సీపీఎస్ రద్దు, ఉద్యోగుల బకాయిల ప్రస్తావన లేకపోవడం శోచనీయమన్నారు.

టంగుటూరులో రీ సర్వే



డ్రోన్ సాయంతో సర్వే చేస్తున్న అధికారులు

నందలూరు(రాజంపేట) : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రీసర్వే మండలంలోని టంగుటూరులో శుక్రవారం నిర్వహించారు. ప్రత్యేకంగా డ్రోన్‌తో ఈ సర్వేను చేశారు. ఇందులో తహసీల్దారు ఉదయశంకర్‌రాజు, డీటీలు మోహన్‌కృష్ణ, జ్యోతి, రాజంపేట సర్వేయర్ వెంకటసుబ్బయ్య, వీఆర్‌ఓలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ రెండురోజుల పాటు రీసర్వే జరుగుతుందన్నారు.

ఏటిపోరంబోకు భూములపై లోకాయుక్తకు ఫిర్యాదు

పెనగలూరు : మండలంలోని సిద్దవరం పంచాయతీ తిరుమలరాజుపేట గ్రామ సమీపంలోని చెయ్యేరు నది ప్రభుత్వ భూమి సర్వేనెంబరు-1పై లోకాయుక్తకు ఫిర్యాదు చేసినట్లు పెనగలూరుకు చెందిన ఎం.విశ్వనాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సర్వే నెంబరు-1లో 30 ఎకరాలకుపైగా ఆక్రమించుకొని 25 సంవత్సరాలుగా మామిడిచెట్లు నాటి పెంచుకున్నారన్నారు. దీనిపై 2010లో ప్రజల ఫిర్యాదుతో అప్పటి ఎమ్మార్వో చెట్లను తొలగించారన్నారు. తదనంతరం తిరిగి చెట్లు నాటడంతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని, కలెక్టర్ ఆదేశాల మేరకు చెయ్యేరు నది వద్ద ప్రభుత్వ భూమిలో వేసిన చెట్లను ఇరిగేషన్ శాఖకు అప్పగించాలన్నారు. 2017లో కోర్టు తీర్పు మేరకు ప్రభుత్వం ఆ తోటలను స్వాధీనం చేసుకుందన్నారు. దీనిపై లోకాయుక్తకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో గొర్రెలు మృతి

పెద్దమండ్యం: పెద్దమండ్యం పంచాయతీ రెడ్డివారిపల్లె హరిజనవాడకు సమీపంలో విద్యుత్‌షాక్‌తో 6 గొర్రెలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన రామాంజులు గొర్రెలు మేపుకొని జీవనం సాగిస్తున్నారు. శుక్రవారం గొర్రెల మేత కోసం హరిజనవాడకు సమీపంలోని బీడు పొలాలవైపు గొర్రెలను తోలుకొని వెళ్లాడు. అయితే గురువారం రాత్రి ఈదురుగాలులకు అవిషిచెట్టు పడడంతో విద్యుత్ తీగ తెగిపోయి నేలపై పడిపోయింది. విద్యుత్ తీగను గొర్రెలు తగలడంతో అక్కడికక్కడే మృతిచెందాయి. చెట్టును తొలగించి విద్యుత్ తీగలను అధికారులు పునరుద్ధరించారు. గొర్రెలు కోల్పోయిన రైతును ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

వైభవంగా గంధోత్సవం

వాల్మీకిపురం : స్థానిక ప్రాచీన సయ్యద్ ఖాజాపీర్ మస్తాన్‌వలి దర్గా ఉరుసు ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి గంధోత్సవం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కడప అమీన్‌పీర్ దర్గా పీఠాధిపతి హజ్రత్ ఖ్వాజా సయ్యద్‌షా ఆరిఫుల్లా మొహమ్మద్ మొహమ్మదుల్ హుసేని చిష్టివుల్ ఖాదరి సజ్జాద నషీన్ ఆస్థాన-ఎ-మఖ్దూముల్లాహి హాజరై దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు, చదివింపులు నిర్వహించారు. ఉరుసు ఉత్సవంలో హిందు, ముస్లిం అనే భేదం లేకుండా యువత పాల్గొన్నారు. శుక్రవారం సాయంత్రం ప్రముఖ కళాకారులచే ఖవాలి కార్యక్రమాలు నిర్వహించారు. రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్ ఖాన్, హజ్‌కమిటీ డైరెక్టర్ ఖాదర్‌బాషా, వక్ఫ్‌బోర్డ్ డైరెక్టర్ కరీముల్లా, వైఎస్సార్‌సీపీ కార్యదర్శి ఆఫూ మొహియుద్దిన్, మతపెద్దలు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మహాస్నపన పూజలు



సిద్దవటం: విగ్రహాలకు మహాస్నపనం చేస్తున్న వేద పండితులు



సంబేపల్లె: పోలేరమ్మ ఆలయంలో ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న దృశ్యం

సిద్దవటం : మండలంలోని పి. కొత్తపల్లె గ్రామ పంచాయతీ వెంకటాయపల్లె గ్రామ శివారులోని అంభాపుర పార్థవేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో నూతన విగ్రహాలకు మహాస్నపన పూజలను వేదపండితులు రంగసముద్రం మల్లికార్జునశర్మ, సుబ్రమణ్యం శర్మలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయంలో ధ్వజ స్తంభం, నాగులు, నవగ్రహాలు, దక్షిణామూర్తి, చండీశ్వరుడు వంటి విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రెండవ రోజు ఉదయం సుప్రభాతసేవ, అమ్మవారికి, స్వామివారికి అభిషేకం, విగ్రహాలకు అభిషేకం గణపతి, నవగ్రహ, రుద్ర, చండీ తదితర పూజలు నిర్వహించామన్నారు. సాయంత్రం దీక్షా హోమం, సహస్త్ర లింగార్చన, శయ్యాదివాసం, జలాదివాసం, ధాన్యాదివాసం వంటి పూజాలు చేసినట్టు వేద పండితులు నిర్వహించినట్టు తెలిపారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠ

సంబేపల్లె : మండల పరిధిలోని నాగిరెడ్డిగారిపల్లె పంచాయతీలోని గోరావాండ్లపల్లో సమీపంలో వెలసిన పోలేరమ్మ ఆలయ ప్రాంగణంలో శుక్రవారం గ్రామ సర్పంచ్, వైఎస్ఆర్‌సీపీ మండల కన్వీనర్ ఉదయకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ధ్వజస్తంభం ప్రతిష్ఠ చేశారు. ఈ సందర్భంగా ప్రతిష్ఠకు సంబంధించి పూజా క్రతువులను శాస్త్రోక్తంగా అర్చకులు నిర్వహించారు. దాతలైన గ్రామంలోని డి.చంద్ర దంపతులు ధ్వజ స్తంభాన్ని ఏర్పాటు చేశారు. ఈ ధ్వజ స్తంభం ప్రతిష్ఠ మహోత్సవాన్ని తిలకించేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు వచ్చారు.

సృజనాత్మకతకు వయసుతో సంబంధంలేదు



అఫ్జల్‌ను సన్మానిస్తున్న హబీబ్‌ఖాన్

రాయచోటి టౌన్ : ప్రతిభకు వయసు అడ్డుకాదని, ప్రతిభకు సృజనాత్మకతను జోడిస్తే విశేషంగా రాణించవచ్చాని, వయసుతో సంబంధం లేదని శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రాయచోటి పట్టణం మాసాపేటకు చెందిన అఫ్జల్ అనే అబ్బాయి నటుడిగా మెహరున్నిసా హీరోయిన్‌గా ఏజె ప్రొడక్షన్స్‌పై అజ్మత్ నిర్మాతగా, అశోక్ డైరెక్టర్‌గా రూపొందించిన టార్చ్ బెరర్ షార్ట్ ఫిలిం విడుదల చేశారు. కార్యక్రమంలో శివ నర్సింగ్ కళాశాల అధినేత శివభాస్కర్, మున్సిపల్ కౌన్సిలర ఈశ్వర్ ప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకుడు శ్యామ్‌కుమార్, జర్నలిస్ట్ వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొని ఈ సినిమాను విడుదల చేశారు. అనంతరం సుధాకర్ రెడ్డిని సినిమా టీం సన్మానించారు. అనంతరం వైఎస్సార్ సీపీ మదనపల్లె పరిశీలకుడు హబీబ్‌ఖాన్ నటుడిని ఘనంగా సన్మానించారు.

త్వరితగతిన పక్కా గృహాలు పూర్తి చేయాలి



జగనన్న లే అవుట్‌లో పర్యటిస్తున్న ఎంపీడీఓ వరప్రసాద్, సర్పంచ్ చిన్న వెంగల్‌రెడ్డి

పెనగలూరు : మండలంలోని జగనన్న కాలనీలలో పక్కా గృహాలు త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ వరప్రసాద్ అన్నారు. శుక్రవారం పెనగలూరు జగనన్న లే అవుట్‌లో స్థానిక సర్పంచ్ దేపూరు చిన్న వెంగల్‌రెడ్డితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న కాలనీలకు విద్యుత్ సౌకర్యంతోపాటు నీటి సౌకర్యం కూడా ఏర్పాటు చేశారన్నారు. కొంతమంది ఇంకా బీఎల్ లెవల్‌లోనే ఉన్నారని, వారు వెంటనే పూర్తి చేసి స్లాబ్‌లు వేయాలన్నారు. పక్కా గృహాలు పూర్తి కాగానే బిల్లులను ఎప్పటికప్పుడు లబ్ధిదారుల ఖాతాలలో ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. లబ్ధిదారులకు సిమెంట్, కడ్డీలు మండల కేంద్రంలోనే సరఫరా చేస్తున్నారని, వాటిని ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో సెక్రటరీలు సుబ్బరాయుడు, సురేష్, వీఆర్‌ఓ కొండయ్య, సర్వేయర్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లతోపాటు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

21న మంచాలమ్మ తిరునాల



మంచాలమ్మ మూలవిరాట్

నందలూరు(రాజంపేట) : ఆడపూరు గ్రామంలో వెలసిన మంచాలమ్మ అమ్మవారి తిరునాల ఈనెల 21, 22న నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త రామచంద్రనాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం అభిషేకం, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం పొంగళ్లు ఉంటాయన్నారు. రాత్రికి అమ్మవారి గ్రామోత్సవం చేస్తున్నట్లు తెలిపారు. గురువారం మధ్యాహ్నం అమ్మవారి కథ శ్రవణం, అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు.